**బొడ్డింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం: జంతర్ మంతర్‌లో అభిజిత్ దీప్కే** 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com netivelugu63@gmail.com

## రిపోర్టర్లు కావలెను
నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో
మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 65 | జూన్ 7 ఆదివారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 65 | PAGES:4 | SUNDAY JUNE 7 2026 | Rs. 4:00

## పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది..
# ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?
– సీఎం రేవంత్ రెడ్డి




- ప్రభుత్వ ఆస్తులు, జల వనరుల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు అని వెల్లడి
- యువతలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఈగిల్ ఫోర్స్
- రాష్ట్రంలో మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్
- హైడ్రా ద్వారా రూ.1 లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడినట్లు వెల్లడి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగిల్ ఫోర్స్ విభాగాలు నేడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ అంశాలపై ప్రసంగించారు.చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమ కట్టడాల నుంచి కాపాడేందుకు 2024 జులైలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సీనియర్ ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో, రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో కలిపి సుమారు 3,000 మంది సిబ్బందితో పనిచేస్తున్న ఈ ఏజెన్సీ, ఇప్పటివరకు రూ. 1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని తెలిపారు. "గతంలో

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

- సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణ
- సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ)లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై (మిగతా 2వ పేజీలో..)



## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

- తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన
- ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం
- సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం
- అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు



## కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు: పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్




- కోటి చెరువు శిఖం భూమిని పవన్ కబ్జా చేశారన్న కవిత
- తెలంగాణ ప్రభుత్వానికి భూమిని అప్పగించాలని డిమాండ్
- తెలంగాణ కచ్చితంగా తమ జాగీరేనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే,

## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు: హరీశ్ రావు

- సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్
- కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య
- ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ

పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు.
(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు.సింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

"అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు.ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు.వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది.ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం... జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు: పవన్ కల్యాణ్‌పై కవిత ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు.ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో ఖ.ు.= (కేసీఆర్, టి. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖు= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే" అంటూ వ్యగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

## పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది.. ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పలుకుబడి ఉన్నవారు విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కోసం జలవనరులను కబ్జా చేసేవారు. ఇప్పుడు ఆ సాహసం ఎవరూ చేయడం లేదు" అని రేవంత్ రెడ్డి వివరించారు. పేదలు చెరువులను కబ్జా చేస్తే అర్థముంది.. కానీ ధనికులు కూడా చెరువులను ఆక్రమిస్తే ఏమనాలి? అంటూ వ్యాఖ్యానించారు.అదే సమయంలో, యువతను లక్ష్యంగా చేసుకున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈగిల్ ఫోర్స్ పనితీరును ఆయన ప్రశంసించారు. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన యాంటీ-నార్కోటిక్స్ విభాగాల్లో ఇది ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

### పాలనాపరమైన ఇతర అంశాలు

తమ ప్రభుత్వం గత 15 నెలల్లో కాలంలోనే 67,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, త్వరలోనే మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు రుణమాఫీ, మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక కార్యక్రమాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు కల్పించామని, తద్వారా ప్రభుత్వ రాబడి తగ్గినా పర్యావరణ హితానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన వెల్లడించారు.

## మమతా బెనర్జీకి దెబ్బ మీద దెబ్బ... టీఎంసీకి గుడ్ బై చెప్పిన మైనారిటీ నేత




పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం సంక్షోభంలో చిక్కుకున్న తృణమూల్ కాంగ్రెస్‌కు (టీఎంసీ) మరో భారీ షాక్ తగిలింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నాయకత్వ శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి మహమ్మద్ అజ్మల్ సిద్ధిఖీ శనివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు.ఇటీవలే హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన సిద్ధిఖీ, తన రాజీనామా లేఖను టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి పంపారు. పార్టీలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, నిబద్ధత గల కార్యకర్తలను విస్మరిస్తున్నారని ఆయన ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.రాజీనామా అనంతరం సిద్ధిఖీ మాట్లాడుతూ అభిషేక్ బెనర్జీపై సంచలన ఆరోపణలు చేశారు. "ప్రస్తుతం పార్టీ కుప్పకూలుతోందంటే దానికి అభిషేక్ బెనర్జీయే ప్రధాన కారణం. ఆయన నియంతృత్వ ధోరణి, అధికార కేంద్రీకరణ వల్ల నిజాయతీ గల కార్యకర్తలకు అన్యాయం జరుగుతోంది. వారి అభిప్రాయాలకు పార్టీలో విలువ లేకుండా పోయింది" అని విమర్శించారు. పాత కేసులు, ఇతర ఒత్తిళ్ల కారణంగా పార్టీలో కొనసాగలేని పరిస్థితులు నెలకొన్నాయని, రాజీనామా తర్వాత ప్రస్తుతం తాను ఎంతో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ పరాజయం పాలైన నేపథ్యంలో, పార్టీలో అంతర్గత విభేదాలు, అసమ్మతి స్వరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ తరుణంలో మైనారిటీ విభాగంలో కీలక నేతగా ఉన్న సిద్ధిఖీ రాజీనామా చేయడం పార్టీకి మరింత నష్టం కలిగించే పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం: జంతర్ మంతర్‌లో అభిజిత్ దీప్కే

**ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ తొలి నిరసన**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**
**నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఫలితాల అవకతవకలపై ఆందోళన**

దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై యువత గళమెత్తింది. సోషల్ మీడియా వేదికగా సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తొలిసారిగా ప్రత్యక్ష నిరసన కార్యక్రమం చేపట్టింది. "బొద్దింకలు రోడ్డెక్కలేవన్న వారికి సమాధానంగానే మేము ఇక్కడికి వచ్చాం" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.నీట్-యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో దొర్లిన అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ నిరసనలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొన్నారు.కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతలో కొందరిని ఉద్దేశించి 'బొద్దింకలు', 'పరాన్నజీవులు' అని చేసిన వ్యాఖ్యలకు వ్యంగ్య స్పందనగా ఈ పార్టీ ఆవిర్భవించింది. బోస్టన్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన అభిజిత్ దీప్కే, ఈ అవమానాన్ని యువత నిరాశకు, నిరుద్యోగానికి ప్రతీకగా మార్చి ఆన్‌లైన్‌లో ఉద్యమాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే లక్షలాది మంది మద్దతుదారులను సంపాదించుకున్న ఈ ఉద్యమం, ఇప్పుడు క్షేత్రస్థాయి పోరాటంగా రూపాంతరం చెందింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యారంగ డిజిటలైజేషన్ లోపాలను సరిదిద్దడం, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టడం వంటివి తమ ప్రధాన డిమాండ్లని నిరసనకారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు వెయ్యి మందికి పైగా సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.



# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట జూన్ 6 నేటి వెలుగు ప్రతినిధి**

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మిదితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ, దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అభినందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఈ నిబంధనల ప్రకారం తడి చెత్త మరియు పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితో పాటు శానిటరీ వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయి. ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని, ప్రజలందరూ ఈ స్పెషల్ రివిజన్‌కు పూర్తి స్థాయిలో సహకరించి తమ పేర్లను నమోదు లేదా సవరణలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా, ఏసీపి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ రావు, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి డాక్టర్ అమూల్య, మున్సిపల్ కిరణ్ కుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో రెండో విడత వార్డు సభలు విజయవంతం





**ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యం -- మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర**

**నల్గొండ, జూన్ 06 నేటి వెలుగు ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లి"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లి కార్యక్రమంలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నేడు రెండో విడతగా లిడివిజన్ నెంబర్లు 13, 14, 15, 16, 17, 21, 22, 23, 24, 44, 45 మరియు 46లిలలో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ లి బి. శరత్ చంద్ర,స్వయంగా లిడివిజన్ నెం. 15 మరియు 16లిలలో నిర్వహించిన వార్డు సభలకు హాజరై ప్రజలతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. వార్డు సభలలో లిసాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026లి మరియు లిఫోర్-వే వేస్ట్ సెగ్రిగేషన్ (నాలుగు రకాల చెత్త వేరు చేయడం)లి పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను లితడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త మరియు ప్రత్యేక సంరక్షణ చెత్తలిగా వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు. అలాగే లి"జల్ సంచయ్ -- జల్ భాగీధారి"లి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని పిలుపునిచ్చారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపడుతున్న లిడ్రైనేజీల పూడికతీత పనులు, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యలులి గురించి ప్రజలకు వివరించారు. డ్రైనేజీలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. నగరంలో లితాగునీటి సరఫరా, పైప్‌లైన్ నిర్వహణ, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలులి నిరంతరంగా చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నగర ప్రజలు చురుకుగా పాల్గొనాలని, రాబోయే విడతల వార్డు సభలకు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి, సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ లిట్టర్‌పై అవగాహన ర్యాలీ





**కూకట్‌పల్లి జూన్ 6 నేటి వెలుగు ప్రతినిధి**

99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూకట్‌పల్లి, సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ లిట్టర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీలో రిషి యూబీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల దుష్ప్రభావాలు, పర్యావరణ పరిరక్షణ అవసరం, పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణ మరియు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు మరియు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి , మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థినులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ మరియు ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం కృషి చేస్తోంది.

# బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులు ప్రభుత్వమే అందించాలి

**బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**

**మిర్యాలగూడ పట్టణం జూన్ 6 నేటి వెలుగు ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్యతరగతి పిల్లలు చదువులకు ప్రభుత్వం కుట్రలు చేయడం పట్ల ఎంతోమంది పేద బీసీ విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని మిర్యాలగూడలో బీసీ భవన్ లో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వై,ఎస్ రాజశేఖర్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల పిల్లలందరూ విద్యతోనే చైతన్య వంతులు అవుతారని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని అవకాశం ఉంటుంది కాబట్టి ఆనాటి ముఖ్యమంత్రి వై,ఎస్ రాజశేఖర్ రెడ్డి గారు బీసీ విద్యార్థులు ఏ కోర్సు చదువుకున్న పూర్తి ఫీజు బాధ్యత ప్రభుత్వమే తీసుకునేది నేడు దానికి భిన్నంగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను వంచించడం బాధాకరం గతం లో ఇంజనీరింగ్, మెడిసిన్ , ఎంబీఏ, ఎంసీఏ, పీజీ ఇతర వృత్తి కోర్సులు చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వమే పూర్తి ఫీజు చెల్లించడం తో అనేకమంది పేదలు ఉన్నత విద్యని అభ్యసించి నేడు మంచి స్థాయిలో ఉన్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి నేడు తెలంగాణ రాష్ట్రంలో బలహీన వర్గాల పిల్లల చదువులు ఏ విధంగా మారాయి అంటే ఇంజనీరింగ్ చదవాలి అంటే కాలేజీ యాజమాన్యాలు డొనేషన్ ల పేరుతోటే 10 నుండి 12 లక్షల రూపాయల వరకు వసూళ్లు చేయడమే కాకుండా సంవత్సరానికి మూడు లక్షల రూపాయల వరకు ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రభుత్వం వాళ్లపై నేటికీ ఏలాంటి చర్యలు తీసుకోలేదు ఇంత పెద్ద మొత్తాన డబ్బులు చెల్లించి చదువుకునే పరిస్థితి పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేక కూలి పనులు చేసుకునే పిల్లలు ఎంతోమంది తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారని ఆయన అన్నారు విద్యా అనేది ప్రతి పేదవాడి హక్కుగా గతంలో ఉండేది నేడు మాత్రం విద్య కేవలం ఒక పెద్దవాడి చదువుగా మాత్రమే తెలంగాణ రాష్ట్రంలో మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద వర్గాల అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుంది ఆ విద్య నేడు వ్యాపారంగా మారి లక్షల రూపాయల వరకు పలుకు తుండడంతో పేద మధ్యతరగతి వర్గాల ప్రజలు చదువు కోలేకపోతున్నారు విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పేద వర్గాలు చదువుకునే చదువులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తే ఎంతోమంది పిల్లలకు ప్రయోజకులు అవుతారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో .. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావు , బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి రవీందర్ గౌడ్, మిర్యాలగూడ బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజు, బీసీ జేఏసీ కో కన్వీనర్ మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# మహిళా సమాఖ్య ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు




**నల్గొండ జిల్లా జూన్ 6 నేటి వెలుగు ప్రతినిధి**

ఈ నెల 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు చెందిన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, మహిళా సంఘాల ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వరి కొనుగోలు 95 శాతం పూర్తయిందని, మిగిలిన 5 శాతం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు దోహదపడే ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రత్యేక డిజైన్‌తో రూపొందించిన పాఠశాల యూనిఫార్మ్‌లను విద్యార్థులకు పంపిణీ చేయాలని అన్నారు. నీట్ యూజీ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, లైటింగ్, బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక తహసీల్దార్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నామని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, జనరేటర్లు, జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్ ,డిఎం రాంపత్తి నాయక్,తదితరులు పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## సమాజంలోని ఘటనలకు సినిమాలకు లంకె.. నటి అనసూయ కీలక వ్యాఖ్యలు



**సమాజంలో జరిగే ఘటనలకు సినిమాలను నిందించడం సరికాదన్న అనసూయ**

**కథ రాసేవారి నుంచి చూసే ప్రేక్షకుల వరకు అందరికీ బాధ్యత ఉంటుందని వ్యాఖ్య**

**క్రియేటివ్ విభేదాల వల్ల కొన్ని అవకాశాలు వదులుకున్నానని వెల్లడి**

**సోషల్ మీడియాలో సినీ కంటెంట్‌ను విశ్లేషించడం మంచి పరిణామమని వ్యాఖ్య**

సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటనకు సినిమాలను కారణంగా చూపడం సరికాదని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. సినిమా ప్రభావం, సామాజిక బాధ్యత అంశాలపై శనివారం ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సృజనాత్మక స్వేచ్ఛతో పాటు, కంటెంట్ విషయంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలని ఆమె గుర్తుచేశారు.సినిమా అనేది ప్రాథమికంగా ఒక కథా రూపమని, అందులోని మంచి చెడులను ప్రేక్షకులు తమ విచక్షణతోనే గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతికూల పరిణామాలకు సినిమాలనే తప్పుబట్టడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కంటెంట్ విషయంలో క్రియేటర్లు, దర్శకులు, నటులతో పాటు ప్రేక్షకులకు సైతం సమాన బాధ్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.గతంలో సినిమాల్లో కథానాయకులు స్ఫూర్తిప్రదాతలుగా, ప్రతినాయకులు గుణపాఠంగా ఉండేవారని, కానీ ప్రస్తుతం నాటకీయత కోసం ఆ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపడం లేదని అనసూయ అభిప్రాయపడ్డారు. క్రియేటివ్ అంశాల్లో ఏకీభవించలేక కొన్నిసార్లు తాను అవకాశాలను సైతం వదులుకున్నట్లు ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో సినిమా కంటెంట్‌ను విశ్లేషించడాన్ని, ప్రశ్నించడాన్ని ఆమె స్వాగతించారు. దీనిని సృజనాత్మకతపై దాడిగా కాకుండా, సమాజంలో పెరుగుతున్న చైతన్యంగా భావించాలని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించినవి కావని, పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేయడమే తన అభిమతమని అనసూయ వివరణ ఇచ్చారు.

## బాక్సాఫీస్ ఛాంపియన్ 'పెద్ది'.. రెండు రోజుల్లో ఎంత వసూల్ చేసిందంటే..!

**రామ్ చరణ్ 'పెద్ది' చిత్రానికి భారీ వసూళ్లు**

**రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్ల గ్రాస్**

**తొలి రోజు రూ. 135.36 కోట్లు రాబట్టిన సినిమా**

**వసూళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన నిర్మాణ సంస్థ**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమా విడుదలైన తొలి రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.తొలి రోజు రూ. 135.36 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది. "బాక్సాఫీస్ ఛాంపియన్ పెద్ది థియేటర్లను జయిస్తోంది" అంటూ నిర్మాణ సంస్థ తన పోస్టర్‌లో పేర్కొంది. దేశీయంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'పెద్ది' భారీ వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రం ఇప్పటికే 2.2 మిలియన్ డాలర్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి సత్తా చాటింది.ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించారు. విశ్వసంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది.




# చెర్లగౌరారం గ్రామంలో ఘనంగా 'బాల పంచాయతీ' కార్యక్రమం..






**పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాల పెంపుదలే లక్ష్యం..**

**నల్గొండ జిల్లా జూన్ 6 నేటి వెలుగు ప్రతినిధి**

నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆదేశానుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమం ఘనంగా జరిగింది. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థాయి నుంచి పిల్లలకు ప్రజాస్వామ్య అవగాహన కల్పించడం, వారి అభిప్రాయాలను వినడం, గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరిచారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, బాలల భద్రత, విద్యా ప్రమాణాలు, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై బాలలు చర్చించారు. బాలలతో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లు, అవగాహన కార్యక్రమాలు, ప్రశ్నోత్తర సమావేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా అభిలాషా బిష్త్ ఐపీఎస్ మాట్లాడుతూ పిల్లల హక్కులు, వారి భవిష్యత్ నిర్మాణం సమాజానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి తల్లి తండ్రి పిల్లలకు సమయం కేటాయిస్తూ వారి ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తే భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ తమలో మార్పు తీసుకురావాలని సూచించారు. అలాగే చిన్నారులు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరచాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

"పిల్లలే మన భవిష్యత్తు. వారికి సమయం ఇవ్వండి, వారి ఆలోచనలను వినండి, ప్రోత్సహించండి" అని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో యంగిస్థాన్ ఎన్జీఓ, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొని బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత బాల్యం, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.చివరగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బాలల సాధికారత, సంక్షేమం కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఏంపిడిఓ వేద రక్షిత,సీఐలు ఆది రెడ్డి, రాము, కరుణాకర్,ఎస్. ఐ అంజలి, రాజీవ్ రెడ్డి,డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ సుశీందర్ రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్య, చెర్లగౌరారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు 300 మందికి పైగా గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో టెక్నాలజీ విప్లవం.. సెన్సార్ బంతి, ఏఐ అవతార్లతో సరికొత్త ఫుట్‌బాల్

**2026 ఫిఫా వరల్డ్ కప్‌లో సరికొత్త టెక్నాలజీ వినియోగం**

**సెన్సార్‌తో కూడిన 'ట్రియోండా' బంతితో కచ్చితమైన నిర్ణయాలు**

**ఏఐ ఆధారిత 3డీ అవతార్లతో ఆఫ్‌సైడ్ గుర్తింపు**

**ప్రతి మ్యాచ్‌లో రిఫరీలకు బాడీ కెమెరాలు, తప్పనిసరి హైడ్రేషన్ బ్రేక్స్**

**48 జట్లతో అతిపెద్ద టోర్నమెంట్‌గా రికార్డ్**



అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2026 ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవడమే కాకుండా, టెక్నాలజీ పరంగానూ ఓ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక సెన్సార్ల సహాయంతో ఆటలో పారదర్శకత పెంచేందుకు, అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఫిఫా సిద్ధమైంది.ఈ టోర్నమెంట్ కోసం అడిడాస్ ప్రత్యేకంగా 'ట్రియోండా' అనే బంతిని రూపొందించింది. ఈ బంతి లోపల ఒక ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) సెన్సార్ చిప్‌ను అమర్చారు. ఇది సెకనుకు 500 సార్లు బంతి కదలికలను, దాని వేగాన్ని, 3డీ స్పేస్‌లో అది ప్రయాణిస్తున్న తీరును రికార్డ్ చేస్తుంది. ఈ డేటాను నేరుగా వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) సిస్టమ్‌కు పంపుతుంది. తద్వారా ఆఫ్‌సైడ్, బంతి ఎవరికి తగిలింది వంటి వివాదాస్పద నిర్ణయాలను మరింత కచ్చితత్వంతో తీసుకోవచ్చు.లెనోవో భాగస్వామ్యంతో మరో ముందడుగు వేశారు. ప్రతి ఆటగాడిని కేవలం ఒక్క సెకనులో స్కాన్ చేసి, వారి శరీర కొలతలతో కూడిన కచ్చితమైన 3ఐ మోడళ్లను (అవతార్లను) సృష్టిస్తారు. ఈ ఏఐ ఆధారిత అవతార్లు సెమీ-ఆటోమేటెడ్ ఆఫ్‌సైడ్ టెక్నాలజీకి ఎంతగానో ఉపయోగపడతాయి. ఆటగాళ్లు గుంపులో ఉన్నా లేదా వేగంగా కదులుతున్నా, వారి కదలికలను కచ్చితంగా ట్రాక్ చేయడానికి ఇవి సహాయపడతాయి. ఈ అవతార్ల ద్వారా ఆఫ్‌సైడ్ నిర్ణయాలను అభిమానులకు మరింత స్పష్టంగా చూపించనున్నారు.వీటితో పాటు మరిన్ని మార్పులు కూడా ఉన్నాయి. ఆఫ్‌సైడ్ టెక్నాలజీని 10 సెం.మీ. కచ్చితత్వం వరకు మెరుగుపరిచారు. రిఫరీలకు రియల్ టైం ఆడియో హెచ్చరికలు అందుతాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో రిఫరీలు బాడీ కెమెరాలను ధరిస్తారు, ఇది అభిమానులకు మైదానంలో ఉన్న అనుభూతిని ఇస్తుంది. మెక్సికోలో భద్రత కోసం రోబో డాగ్స్‌ను కూడా వినియోగించనున్నారు. ఆటగాళ్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి అర్ధ భాగంలో 22వ నిమిషం వద్ద 3 నిమిషాల హైడ్రేషన్ బ్రేక్ తప్పనిసరి చేశారు.మొత్తం 48 జట్లతో జరగనున్న ఈ అతిపెద్ద టోర్నమెంట్‌లో టెక్నాలజీ వినియోగం ఆటను మరింత నిష్పక్షపాతంగా మార్చడమే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులకు ఒక సరికొత్త వీక్షణ అనుభవాన్ని అందించడం ఖాయం.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**